# సంస్కరణ


-బులుసు-జీ-ప్రకాష్

శ్రీ సచ్చిదానంద యోగీంద్రులు గోదావరిలో స్నాన సంధ్యాద్యనుష్టానాలు ముగించి అర కిలోమీటరు దూరంలోవున్న కుటీరాన్ని చేరాలి. ఆయన కందుకూరి, గురజాడలను మించిన సంస్కర్త అని అతని అనుయాయులు భావిస్తుంటారు. ఆ తీరంలో వున్న గ్రామస్థులు అతన్ని మహర్షి అని సంబోధిస్తుంటారు.

ఆయన స్నానం చేసిన దగ్గరనుంచీ సంధ్యావార్చిన వరకూ ఆయనకోసం వేచి వున్నాడు సమవర్తి. సచ్చిదానంద మహర్షి స్నానం ముగించుకుని ఆశ్రమానికి బయలుదేరగానే ఆయనకు భక్తి ప్రపత్తులతో సాష్టాంగ నమస్కారాలాచరించి తను కూడా వెనువెంటనే వస్తున్నాడు.

''ఏమిటి విశేషాలు సమవర్తీ?'' అడిగారు యోగీంద్రులు.

''ఏముంది స్వామీ!'' అని విచారంగా ముఖం పెట్టాడు సమవర్తి ''దిక్కూ మొక్కూలేని



దీనుడినయ్యాను. తల్లి క్షయతో మరణించింది. తండ్రి గుండె జబ్బుతో మా తల్లిని అనుసరించాడు''

''హరి హరీ'' అన్నారు మహర్షి.

''ఇదే నా ఆశ్రమం. లోనికిరా'' ఆహ్వానించారు మహర్షి.

సమవర్తి ఆశ్రమంలో ప్రవేశించి మహర్షి చూపించిన ఆసనంపై ఆసీనుడయ్యాడు.

''విచారించక ధైర్యంగా వుండు. గుండె నిబ్బరం వహించు. కష్టాలన్నవి జీవరాసులకు కాక నిర్జీవాలకొస్తాయా? నాకూ ఇలాంటి అనుభవమే ఎదురైంది. నాకిచ్చి పెళ్లి చేద్దామనుకున్న కన్యని, ఆమె తల్లిదండ్రులు ఇంకొకనికిచ్చి పెళ్లి చేసారు. ఆమె భర్త ఆమెను విడిచేసి ఎటో పోయాడు. ఆమె తల్లిదండ్రులు బెంగతో అమరావతి చేరుకున్నారు. ఆమె రాత్రీ పగలూ అమ్మా నాన్నా అని ఒకటే గోల. ఎవరికి తప్పినా మనబోటి సంస్కర్తలకు తప్పదుకదా? ఈ ఆశ్రమంలోనే ఆమెకు ఆశ్రయం కల్పించాను. అందులోకీ సంస్కరణశీలి కందుకూరివారి రాజమహేంద్రికి సమీపంలో వుంటున్నాం'' అన్నారు మహర్షి గడ్డం నిమురుతూ.

''ఆమె ఇప్పుడు ఇక్కడే వుందా మహర్షి?'' ప్రశ్నించాడు సమవర్తి కుతూహలంగా.

''లేదు. కొద్ది రోజుల క్రిందటే గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది'' అన్నారు మహర్షి.

''ఆమె అయితే అలా చేసిందిగానీ నేను మాత్రం అలాంటి తెలివితక్కువ పని చేయను. తమవంటివారుండగా నాకేం ఖర్మ?'' అన్నాడు సమవర్తి.

''అదే నాక్కావల్సింది'' అన్నారు యోగీంద్రులు. ''ఆత్మహత్మ మహాపాతకం. అట్టివారిని వైకుంఠంలోనికి రానీయకుండా జయ విజయులు అడ్డగిస్తారు'' అర్ధ నిమీలిత నేత్రులై యోగీంద్రులు దివ్యలోచనాలతో చూస్తున్నట్లుగా మరేదో ఆలోచనల్లోకి వెళ్లిపోయారు.

''ఆత్మహత్య మహాపాతకం అని మన ధర్మ శాస్త్రాల్లో లిఖించబడ్డది. ఒక స్త్రీమూర్తి గర్భం దాల్చి వుండగా భర్తచేత విడాకులివ్వబడ్డది. ఆమెకు మరి దిక్కేది? ఆత్మహత్యా ప్రయత్నాన్ని అడ్డుకుని సీతమ్మ వారిని వాల్మీకి ఆదుకున్నట్లుగా ఆఖరికి నేనే ఆమెకు ఈ ఆశ్రమంలో ఆశ్రయమిచ్చి బిడ్డని కన్న తరువాత మరో ఆయనకిచ్చి వివాహం చేసాను. ఆయన గొప్ప ఆస్తిపరుడూ, నా అనుచరుడూను. ఆ తల్లిబిడ్డలిద్దర్నీ లక్షణంగా చూసుకుంటున్నాడు'' అన్నారు యోగీంద్రులు.

నాటినుండి సచ్చిదానంద యోగీంద్రులు అడుగుజాడలలో ప్రవర్తించడం మొదలుపెట్టాడు సమవర్తి.

ప్రొద్దున్నేలేచి ప్రకృతి పిలుపులకు స్పందించిన పిమ్మట స్నానం సంధ్య జపం, తపం ఆచరిస్తూనే ఉన్నాడు సమవర్తి యోగీంద్రుల అనుగ్రహంవల్ల.

చీకటి పడుతోంది. శ్రీ సచ్చిదానంద యోగీంద్రుల ఆశ్రమం ఎదుట ఒక రిక్షా ఆగింది. లోపలికి ఒక నల్లని చీర కట్టుకుని పడుచుదనంతో పిటపిటలాడుతున్న ఒక అందమైన అమ్మాయి వస్తోంది.

ఎవరు చెప్మా? ఎవరది?

''సునీధా! నువ్వేనా? ఈ రాత్రి... ఇదేమిటిలా వచ్చేశావ్? రారా...లోపలికి'' అన్నారు యోగీంద్రులు.

''ఔన్నాన్నా! నేనే! నీ సునీధని. నాకేదీ దిక్కులేక నీ దగ్గరకొచ్చేసాను.''

''అదేమిటమ్మా అలా అంటున్నావ్? ఏమైందేమిటి?''

''నేనిక నుంచీ ఆయనతో జీవించలేన్నాన్నా! ఆయనకా జబ్బు ఇంక నయం కాదు. సేవ చేసి చేసి జీవచ్ఛవాన్నైపోయాను'' ఆవేదన వ్యక్తం చేసింది సునీధ.

''అయ్యో పిచ్చితల్లీ! మరేం అధైర్యపడకమ్మా. అదే నయం అయిపోతుంది. మనది మహా పతివ్రతా శిరోమణులు పుట్టిన దేశం. సుమతీదేవి తన కుష్టు భర్తను సేవించి తన పాతివ్రత్యంవల్ల ఆ రోగాన్ని సమూలంగా నాశనం చేయలేదా తల్లీ! చాలా తొందర పడిపోయావమ్మా! పోనీలే. కొద్దికాలం ఆశ్రమంలో

వుండి వెలుదువుగాని'' సర్దిచెప్పారు మహర్షి.

వారంరోజులు పోయాక యోగీంద్రులు లేచి ''సునీధా'' అని పిలిచాడు. సునీధ కనబడలేదు. ఆశ్రమం అంతా వెదికారు. ఎక్కడా సునీధ జాడలేదు. శిష్యుడు సమవర్తి సహాయంతో ఆమె జాడ తెలుసుకుందామనుకున్నాడు.

''సమవర్తీ'' అని పిలిచారు. చుట్టుపట్ల నుంచి సమవర్తి అని ప్రతిధ్వని వచ్చిందే తప్ప సమవర్తి ''వస్తున్నా మహర్షి'' అనలేదు.

అక్కడో ఉత్తరం పడివుంటే యోగీంద్రులు చదివారు.

''నాన్నకి...

కందుకూరివారు తన సమీప బంధువు శ్రీరాములుకిచ్చి ఒక వితంతువుతో వివాహం జరిపించి తన సొంత కుటుంబంలో సంస్కరణ ప్రారంభించారు.

నువ్వు మాత్రం నీ సొంత కూతురుని ఆమె కుష్ఠు భర్త బారి నుండి రక్షించి సంస్కరణ చేయలేకపోయావు. కుష్ఠు రోగి అయిన భర్త నుండి భార్య, భార్య నుండి భర్త విడాకులు పొందవచ్చని హిందూ వివాహ చట్టం స్పష్టంగా పేర్కొంది. ఆ సలహా చెప్పడం మానేసి సుమతీదేవిలాగ పతిసేవ చేయమన్నావ్.

అందుకే నా సంస్కరణ నేనే చేసుకోవాల్సి వచ్చింది. ఒక లతాకుంజం ఉద్భవించి అండగా ఒక వృక్షాన్ని ఆనుకుని అల్లుకుపోయినట్లుగా స్త్రీలకు పురుషులు, పురుషులకు స్త్రీలు అండదండలు ఏ ఒక్కరూ స్వతంత్ర జీవనులు కారు.

నేను నీ శిష్య పరమాణువు సమవర్తితో ఇక్కడ క్షేమంగా వున్నాను.


ఇట్లు
నీ
సునీధ'' ★

# కల్తీ విజ్ఞానం

ఔషధాలు, మందులు, ఆహారంలో కల్తీ జరిగితే మరణాలు సంభవించడం చూస్తూనే వుంటాం. అయితే ఒక రంగంలో మాత్రం కల్తీ జరిగినా ఏ ఇబ్బంది కలగకపోగా కల్తీ పెరిగేకొద్దీ ఆ రంగం అభివృద్ధి చెందుతూ వుంటుంది.

ఈ విజ్ఞాన రంగాన్ని మెటీరియల్ సైన్స్ అని పిలుస్తారు. అతి సూక్ష్మ తంత్ర జ్ఞానంతో తయారయ్యే టీవీ, కంప్యూటర్, సెమి కండక్టర్, సూపర్ కండక్టర్లు ఈ రంగపు కానుకలే.

కల్తీ విజ్ఞానపు దారిని కనుగొన్నది 1839లో. చార్లెస్ గుడ్ ఇయర్ అనే ఆయన రబ్బరుకు గంధకపు పొడిని కలిపినప్పుడు అది అత్యంత గట్టిదనాన్ని పొందడం గమనించారు. ఇలా తయారైన రబ్బరు అధిక వేడికి, చలికి ఏ రకమైన పరివర్తన చూపించలేదు. అప్పటినుంచి రబ్బరు వాడకం అధికమైంది. రబ్బరుకు గంధకాన్ని చేర్చే ప్రక్రియను వల్కనైజేషన్ అంటారు. ఇలా వల్కనైజేషన్ చేయబడిన రబ్బరును వాహనాల టైర్లు, ట్యూబులు, గ్యాస్కెట్లు వివిధ రకాల ఫ్యాన్ బెల్టులు తయారు చేయడానికి వాడతారు.



లోహపు రంగంలో కూడా కల్తీ బాగా వాడుకలో వుంది. మనం చూసే రేస్ కార్లు, బైకులు, స్కూటర్లు వంటి వాహనాల ముఖ్యమైన భాగాలను కల్తీ వస్తువులతోనే చేస్తారు. శుద్ధమైన ఇనుము మృదువైనదేకాక త్వరగా తుప్పు పడుతుంది. ఇదే ఇనుముకు నిర్దిష్ట ప్రమాణంలో క్రోమియం లేదా జర్మేనియం మిశ్రమాన్ని చేరిస్తే ఇనుము గట్టిబడడమేకాక తుప్పు నిరోధించే శక్తిని పొందుతుంది.

1912లో ఇంగ్లండుకు చెందిన బ్రియర్లి అనే ఆయన మొట్టమొదట స్టెయిన్‌లెస్ స్టీలు తయారు చేయడానికి నాంది పలికాడు. శుద్ధమైన ఇనుముకు 14-15 శాతం క్రోమియం చేరిస్తే తుప్పు పట్టని ఉక్కు తయారవుతుంది.

ఇక బంగారు ఆభరణాల విషయానికొద్దాం. బంగారు వస్తువులు కొనేటప్పుడు ప్రతివారూ దాని శుద్ధతపట్ల జాగ్రత్త వహిస్తారు. అయితే నిజం మరొకటి. దేనిని శుద్ధమైనదిగా భావిస్తామో అది ఆభరణాల విషయంలో వట్టి మాటే. బంగారం శుద్ధమైనది. అయితే కావాల్సిన ఆభరణాలు చేయించుకుని ధరించడం సాధ్యంకాని విషయం. ఎందుకంటే శుద్ధమైన బంగారం చాలా మృదువైనది. దీనిలో రాగి లేదా వెండిని నిర్దిష్ట ప్రమాణంలోకలిపి వాడడం జరుగుతుంది. ఇలా తయారైన బంగారపు క్వాలిటీ (క్యారెట్) అందులో వాడిన రాగి లేదా వెండి ప్రమాణాన్నిబట్టి నిర్ణయిస్తారు. శుద్ధమైన బంగారం 24 క్యారెట్ అని పిలుస్తారు. అందులో కల్తీ జరిగినిదానిని బట్టి 10, 14, 18, 22 క్యారెట్‌ల బంగారం బజార్లో దొరుకుతుంది.

మనం వాడే టీవీ, విసిఆర్, టేప్ రికార్డర్‌లలో ముఖ్యంగా వుండే ఇంటిగ్రేటెడ్ చిప్స్ కల్తీ వస్తువుల సముదాయాలే. వీటిలో వాడే సెమి కండక్టర్లు, కంప్యూటర్ దేహ రచనకు ఉపయోగించే వస్తువులు, గ్రామ్‌ఫోన్ ప్లేట్లు ప్రతీది కల్తీ వస్తువుల కానుకే.

ఇంటి ఫ్లోర్‌కి వాడే టైల్స్ కూడా సిలికేట్లను పొంది వుంటాయి. వాటి మన్నిక కోసం సిలికేట్, అల్యూమినేట్, టొరేట్‌ల వంటి బయట వస్తువుల్ని కలిపి టైల్స్ గట్టితనాన్ని పెంచవచ్చు.

ఇక్కడ గమనించవలసిన ముఖ్య విశేషం ఏమిటంటే నిర్ణీత ప్రమాణాన్ని మీరి అధిక మొత్తంలో కల్తీ జరిగితే వస్తువు గట్టితనం పెరగదని!

-పి. రాధిక